డ్రోన్ వినియోగంపై నిషేధం

ఏసీసీ, ఏప్రిల్ 27: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల కోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వీఐపీలు హెలికాప్టర్ల ద్వారా రానున్నందున డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డ్రోన్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా కోర్టులో కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం

ఏసీసీ, ఏప్రిల్ 27 : మంచిర్యాల పట్టణంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో జిల్లా ప్రధాన, సెషన్స్ జడ్జి బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జడ్జి శ్రీనివాసులు కేసుల పురోగతి, పెండింగ్ కేసులను పరిష్కరించడంపై అధికారులతో చర్చించారు. క్రిమినల్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న నాన్‌బెయిలబుల్ వారెంట్ కేసుల గురించి, జైలులో ఉన్న ఖైదీల కేసుల పరిష్కారం గురించి చర్చించి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్, ఏసీపీ ప్రకాష్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి నిరోష, ఎక్సైజ్ సూపరిండెంటెంట్, లక్సెట్టిపేట సబ్ జైల్ సూపరింటెండెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఓపెన్ పరీక్షలు

ఏసీసీ, ఏప్రిల్ 27 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు జిల్లాలో శనివారం సజావుగా జరిగాయి. 10వ తరగతిలో 634 మందికి 527 మంది హాజరు కాగా 107 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో 877 మంది విద్యార్థులకు 760 మంది హాజరు కాగా 117 మంది గైర్హాజరయ్యారు. డీఈవో యాదయ్య రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ

ఏసీసీ, ఏప్రిల్ 27: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫుల్లూరి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రీన్‌సిటీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 29 నుంచి మే 12 వరకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు సెల్ 9849505695లో సంప్రదించాలన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

కన్నెపల్లి, ఏప్రిల్ 27: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సృజన నర్సింగరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన సమావేశానికి సగం మందికి పైగా అధికారులు రాకపోవడం ఏమిటని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. వచ్చిన అధికారులు సమావేశంలో ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ రాకేష్ శర్మ, ఎంపీటీసీ నెండుగూరి భారతి, ఎంపీడీవో గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలనలపై ఆసక్తి పెంచుకోవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌రాహుల్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 27: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పరిశీలనపై ఆసక్తి పెంచుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి రోబోటిక్స్‌పై శిక్షణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నూతన ఆలోచనలతో ముందుకు రావాలని, ఆవిష్కరించిన అంశం సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన గ్యాస్ సెన్సార్ కిట్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ కిట్, బ్లైండ్ మాన్‌స్టిక్, ఉష్ణోగ్రత గుర్తించే పరికరం, ఆల్కహాల్ గుర్తించే కిట్, సెన్సార్ ప్రాజెక్టులను పరిశీలించారు. మెంటర్ విశాల్, రీసోర్స్ పర్సన్స్ జాకీర్ హుస్సేన్, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించాలి

తాండూర్: ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బోయపల్లిలో నిరుద్యోగులు ఒక ఇంటిని గ్రంథాలయంగా ఏర్పాటు చేసుకుని చదువుతుండగా సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైన పుస్తకాలు, కుర్చీలు, ఇతర సామగ్రిని మంజూరు చేశారు. శనివారం గ్రంథాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించిన అదనపు కలెక్టర్‌కు యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల నిందితులను అరెస్టు చేయాలి

జైపూర్, ఏప్రిల్ 27: వేలాల గుట్టపై గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన నిందితులను అరెస్టు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్‌మాదిగ పేర్కొన్నారు. శనివారం గట్టు మల్లన్న స్వామి దేవాలయాన్ని పార్టీల నాయకులు, యువకులతో కలిసి సందర్శించి విలేకరులతో మాట్లాడారు. గుప్తనిధుల కోసం శివలింగాన్ని తవ్వగా ఈ విషయాన్ని ఈవో, ఆలయ పూజారికి తెలిసినప్పటికీ ఎవరికీ చెప్పకుండ సిమెంట్‌తో యథావిధిగా ఏర్పాటు చేశారన్నారు. పూజారీ, ఈవో మీదనే అనుమానం ఉందని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తిరుపతి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గట్టయ్య, మీసాల రాజ్‌కుమార్, హరీష్, జశ్వంత్, అజయ్ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

ఏసీసీ, ఏప్రిల్ 27: పట్టణంలో కొక్కిరాల రఘుపతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ట్రస్టు సభ్యులు కొక్కిరాల సత్యపాల్‌రావు, రుక్మిణిల చేతుల మీదుగా బస్టాండ్, కూరగాయల మార్కెట్, ఓవర్ బ్రిడ్జి, బెల్లంపల్లి చౌరస్తా, హమాలీవాడ, ఐబీ చౌరస్తాల వద్ద ప్రారంభించారు. ఆరేండ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రాలు, అంబలి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తూముల నరేష్, పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ, రమేష్, బాబన్న పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ కాలనీ, సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ట్రస్ట్ కార్యదర్శి కొక్కిరాల సత్యపాల్‌రావు-రుక్మిణిలు ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖలీద్, మాజీ ఎంపీటీసీ సీపతి మల్లేష్, నాయకులు సత్తార్, శ్రీనివాస్, క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

ఎలక్షన్ ఎఫెక్ట్...

- జిల్లాలో తగ్గిన భూ క్రయ విక్రయాలు
- నగదు లావాదేవీలపై ఆంక్షలే కారణం
- భారీగా పడిపోయిన డాక్యుమెంటేషన్



మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మంచిర్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపుతోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లో ఉండటంతో దాదాపు రెండు నెలల పాటు రిజిస్ట్రేషన్లు అరకొరగా జరగగా, ప్రస్తుతం పార్లమెంట్ ఎలక్షన్ల సమయంలోనూ అదే పరిస్థితి నెలకొంది. నగదు లావాదేవీలపై ఆధారపడ్డ రియల్ రంగంలో ప్రస్తుతం భూముల క్రయ, విక్రయాలు పూర్తిగా నిలిచిపోగా, వినియోగదారులు లేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతు న్నాయి. ఎలక్షన్ కోడ్ రాక ముందు నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు కాగా, కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఒక్కసారిగా పడిపోయింది. భూముల క్రయ, విక్రయాలకు సంబంధించి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కాగా, ఆంక్షల కారణంగా వాటిని తీసుకెళ్లడం కష్టసాధ్యంగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధికంగా డబ్బుల వినియోగం జరుగుతుండగా, ఎక్కడ కూడా ఆధారాలు ఉండే అవకాశమే లేదు. దీంతో నగదు తరలించే సమయంలో పోలీసులకు దొరికితే సీజ్ అయ్యే అవకాశం ఉండటంతో భూముల క్రయ, విక్రయాల జోలికి వెళ్లడంలేదు.

తగ్గిన డాక్యుమెంటేషన్...

ఎలక్షన్ కోడ్ కారణంగా జిల్లాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో డాక్యుమెంటేషన్ ప్రక్రియ గణనీయంగా పడిపోయింది. మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, జూన్ 4తో ముగుస్తోంది. కోడ్ అమల్లోకి రాక ముందు సగటున నిత్యం వందకుపైగా రిజిస్ట్రేషన్లు జరుగగా, ప్రస్తుతం వాటి సంఖ్య సగానికి పడిపోయింది. మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్చి నెలలో మొత్తం 1587 రిజిస్ట్రేషన్లు జరుగగా, రూ.4 కోట్ల 73 వేల ఆదాయం సమకూరింది. లక్సెట్టిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 319 డాక్యుమెంటేషన్లు జరుగగా, రూ.53 లక్షల 68వేల ఆదాయం సమకూరింది. ఏప్రిల్ మాసంలో శనివారం నాటికి మంచిర్యాల కార్యాలయంలో మొత్తం 1100 రిజిస్ట్రేషన్లు జరుగగా రూ. 3.56 కోట్ల ఆదాయం వచ్చింది. లక్సెట్టిపేట కార్యాలయంలో 253 డాక్యుమెంట్లు జరుగగా రూ.42 లక్షల 6 వేల ఆదాయం మాత్రమే సమకూరింది. ఎలక్షన్ కోడ్ కారణంగా మంచిర్యాలలో రూ. కోటి పైచిలుకు ఆదాయం, లక్సెట్టిపేటలో రూ. 10 లక్షల ప్రభుత్వ ఆదాయం తగ్గింది

రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గింది: మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ బాల్‌కిషన్



పార్లమెంటు ఎన్నికల సందర్భంగా భూముల రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. నగదు తరలింపులపై ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు ఉండటంతో భూముల క్రయ, విక్రయాలకు ప్రజలు ముందుకు రావడం లేదు. కేవలం ఒక నెలలోనే ప్రభుత్వ ఆదాయంలో గణనీయమైన తేడా కనిపిస్తోంది. మరికొద్ది రోజులు కూడా పరిస్థితులు ఇలాగే ఉండే అవకాశం ఉంది.

ఏడాది మొత్తం పోయినట్లే.. పూడెం వెంకటస్వామి, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో బిజినెస్ పూర్తిగా తగ్గుముఖం పట్టింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా క్రయ విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో లే అవుట్ లేని వెంచర్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. ఎన్నికలు ముగిసిన తరువాత ప్రభుత్వం సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టి ప్రత్యేక రుసుం వసూలు ద్వారా ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ ప్రయోజనాలు కాపాడేది బీఆర్‌ఎస్ పార్టీయే



నస్పూర్‌లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బాల్క సుమన్

నస్పూర్, ఏప్రిల్ 27: తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయం వద్ద శనివారం పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్ రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి బాల్క సుమన్ జెండా ఆవిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కొత్త పుంతలు తొక్కి దేశానికే బీఆర్‌ఎస్ పార్టీ దిశానిర్దేశంగా నిలిచిందన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు, నేతలు బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏమీ చేశాయని, ఈ రెండు పార్టీలకు ఎందుకు ఓట్లు వేయాలని సుమన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి మోసంతో గద్దెనెక్కిందన్నారు. కుటుంబ పాలన అని విమర్శలు చేసిన వాళ్ళు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండగా అదే కుటుంబానికి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని కూడా నిలబెడితే అది కుటుంబ పాలన కాదని ఎద్దేవా చేశారు. దళిత బిడ్డకు, ధనిక బిడ్డకు మధ్య పెద్దపల్లిలో పోటీ నెలకొందన్నారు. నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, అక్కూరి సుబ్బయ్య, పవన్ కుమార్, రఫీక్, సురేందర్ రెడ్డి, బానుచందర్ పాల్గొన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు...

-జిల్లాలో 44.8 డిగ్రీలు నమోదు - ఆరెంజ్ అలెర్ట్ జారీ



మంచిర్యాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రోజురోజుకూ అధికమవుతున్న ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే మొదలైన ఎండ వేడి రాత్రి 9 దాటినా తగ్గుముఖం పట్టడం లేదు. విపరీతమైన ఎండలకు తోడు మధ్యాహ్నం సమయంలో వడగాల్పులు, ఉక్కపోతతో సతమతమవుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటితే ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యమవుతున్నాయి.

జిల్లాలో శనివారం 44.8 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాసిపేట మండలం కొండాపూర్, కోటపల్లి మండలం దేవులవాడ, దండేపల్లి మండలం వెల్గనూరు, నస్పూరు మండలంలో గరిష్టంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, చెన్నూరు, జన్నారం మండలాల్లో 44.5 డిగ్రీలు, భీమిని మండలంలో 44.2 డిగ్రీలు, జన్నారంలోని కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో 44.1 డిగ్రీలు, జిల్లా కేంద్రంలో 43.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన వడగాలులు, ఎండవేడిమి కారణంగా వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

హాజీపూర్, ఏప్రిల్ 27: దొనబండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ మోతిలాల్ పరిశీలించారు. అయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 262 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులందరు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు ధాన్యాన్ని మట్టి, బెడ్డలు లేకుండా కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

దండేపల్లి: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ సంధ్యరాణి నిర్వాహకులకు సూచించారు. రెవెన్యూ సిబ్బంది 3 టీమ్‌లుగా వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు, కొనుగోలు తీరు, గన్ని సంచుల, ధాన్యం రవాణా అంశాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్, విజయ, ఆర్‌ఐ భూమన్న, ఐకేపి సీసీలు, గ్రామైఖ్య సంఘం సభ్యులు ఉన్నారు.

ఏనుగుల నుంచి రక్షణ కోసం అవగాహన సదస్సు



కోటపల్లిలో అవగాహన కల్పిస్తున్న రేంజర్ రవి

కోటపల్లి, ఏప్రిల్ 27: గోదావరి, ప్రాణహిత తీరాన్ని దాటి ఏనుగుల గుంపు వస్తే తీసుకోవాల్సిన చర్యలపై అటవీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సదస్సులో అటవీ శాఖ రేంజర్ రవి, ఎంపీడీవో ఆకుల భూమన్న, పశు వైద్యాధికారి పవన్‌కుమార్, విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు, వాలంటీర్లకు, ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఏనుగులకు చూపు తక్కువగా ఉంటుందని, వినికిడి ఎక్కువగా ఉంటుందని, వాసన దూరం నుంచే పసిగడుతుం దని పేర్కొన్నారు. సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగుల సంచారంపై అటవీ శాఖ అధికారులకు వెంటనే తెలియజేయాలని పేర్కొన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో బైనాక్యులర్ సహాయంతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రజలు దీనిపై అప్రమత్తంగా ఉండాలని రేంజర్ రవి కోరారు. ఒక వేళ ఏనుగుల గుంపు వచ్చినా అవి ఎంతో కాలం ఉం డవని వచ్చిపోతాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ముందు జాగ్రత్తగా ఆయా గ్రామాల్లో అటవీ సిబ్బంది సహకారంతో అవగాహన సదస్సులతో ప్రజలకు తెలిసేలా చాటింపు చేపట్టినట్లు రేంజర్ వివరించారు.

సేంద్రియ మేళాలో రైతులు పాల్గొనాలి

హాజీపూర్, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలో ఈనెల 30, మే 1న జరిగే సేంద్రియ మేళాలో మండల రైతులు పాల్గొనాలని ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పుస్కూరి శ్రీనివాసరావు కోరారు. శనివారం హాజీపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేళాలో సేంద్రియ ఉత్పత్తులు వాడే విధానంపై వివరిస్తామన్నారు. ప్రతీ రైతు ఒక ఎకరంలో సేంద్రియ పంటలను పండించాలని సూచించారు. నిర్వాహకులు గోనె శ్యాంసుందర్‌రావు, డైరెక్టర్ శంకర్, బొలిశెట్టి తిరుపతి, ధర్మయ్య, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వేణుగోపాలచారికి సన్మానం

బెల్లంపల్లి, ఏప్రిల్ 27: మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి శనివారం బెల్లంపల్లికి రాగా కాంగ్రెస్ నాయకులు ఆయనను సన్మానించారు. సూరిబాబు, నాతరి స్వామి, జయరాం యాదవ్, అప్జల్, సత్యనారాయణ, సురేష్, సత్తిబాబు, అమానుల్లాఖాన్, యాదగిరి, జావిద్‌ఖాన్, కిషన్ సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

గడీల పాలన పోయి ప్రజా పాలన వచ్చింది



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద, వంశీకృష్ణ

ఏసీసీ, ఏప్రిల్ 27: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న గడీల పాలన పోయి కాంగ్రెస్ ప్రజాపాలన వచ్చిందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, కుల సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యేలు స్థానిక సమస్యలను పరిష్కరిస్తూ ప్రచారం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, త్వరలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. మహిళలకు సంవత్సరానికి లక్ష రూపాయల పథకాన్ని అమలు చేస్తామన్నారు. రైతు రుణమాఫీని ఎన్నికల కోడ్ అయిపోగానే పూర్తి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు నిత్యావసర, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాయని మండిపడ్డారు. పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కార్మికులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ కార్మికుల ద్రోహి బీఆర్‌ఎస్ ప్రభుత్వమన్నారు. బీజేపీ కుల మతాలను రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తుందన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్ వెంకటేశ్వర్లు, రమేష్, నేతకాని సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటరు స్లిప్పులను చూపుతున్న ఉపాధి కూలీలు

కాసిపేట, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ భోజన్న అన్నారు. శనివారం వరిపేట శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటరు స్లిప్పులను అందజేశారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

దండేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో బీఎల్‌వోలు ఇం టింటికి వెళ్లి ఓటర్ల స్లిప్పులను పంపిణీ చేశారు. మే 13 జరిగే పోలింగ్ రోజు ఓటర్ స్లిప్పుతోపాటు ఏదైన గుర్తింపు కార్డును వెంట తీసుకువెళ్లాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

భీమిని, ఏప్రిల్ 27: లక్ష్మీపూర్, ఖర్జీభీంపూర్, అక్కలపల్లి, మల్లీడి గ్రామాల్లో తహసీల్దార్ బిక్కర్ణదాస్ పోలింగ్ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు పరిశీలించారు. తాగునీటి వసతి, మూత్రశాలలు, విద్యుత్తు సౌకర్యంపై తెలుసుకున్నారు. పోలింగ్ చిట్టీల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆర్‌ఐ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

గడ్డం వంశీ గెలుపునకు కృషి చేయాలి

చెన్నూరు, ఏప్రిల్ 27: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం బీఆర్‌ఎస్ నాయకులు రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామిగౌడ్, బుచ్చయ్య, రాంచందర్, జగన్ మోహన్‌రెడ్డి, వినయ్, మధు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంట్‌ను ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు సూర్యనారాయణ, పాల్గొన్నారు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 27: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. శనివారం చిర్రకుంట, శంకర్‌పల్లి, పొన్నారం, సారంగపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. మే 31 నాటికి పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. బొక్కలగుట్టలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి సూచనలు చేశారు. సీసీ పరిపూర్ణచారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

దండేపల్లి, ఏప్రిల్ 27: గూడెం, రంగంపల్లి, ద్వారక గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో 5 గ్యారంటీలు అమలు చేశామన్నారు. ద్వారక గ్రామానికి చెందిన శంకర్‌రావు, తోట శంకర్, అశోక్, గూడెం, రంగంపల్లి చెందిన దుమ్మ సునిల్, నగేష్‌మల్లేష్, మల్లన్నతోపాటు సుమారు 100 మందిపైగా చేరారు. ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, త్రిమూర్తి, సత్యంరావు, వెంగల్‌రావు పాల్గొన్నారు.

గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

బెల్లంపల్లి, ఏప్రిల్ 27: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని మాలల జేఏసీ చైర్మన్ చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్‌లు వెంకటేశ్వర్లు, రమేష్, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌లు పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ భవన్‌లో తెలం గాణ మాల మహానాడు సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పేర్కొన్నారు. నారాయణ, మధుకర్, మల్లయ్య, చిన్నయ్య, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల, ఏప్రిల్ 27: మండల కేంద్రంలో ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్‌కు చెందిన రైస్‌మిల్లులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 4గంటల ప్రాంతంలో ఆపరేటర్ వెంకటేష్ మిల్లుకు వెళ్లి షట్టర్ తెరిచే సరికి మంటలు కనిపించాయి. కేకలు వేయడంతో గ్రామస్థులు పోగయ్యారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు వ్యాపించకుండా ధాన్యంబస్తాలను తొలగించారు. మూడుగంటలపాటు మోటార్ల సాయంతో మంటలను ఆర్పి వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే ప్యానల్ బోర్డు, స్టార్టర్లు, కరెంటు మీటరు కాలిబూడిదయ్యాయి. రూ.6 లక్షలవరకు నష్టం జరిగిందని మిల్లుయజమాని తెలిపారు.షార్ట్ సర్క్యూట్ వల్ల కాదని, ఎవరో గిట్టనివారు చేసి ఉంటారని ఎస్సై ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వినోద్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం గురించి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

భీమారం, ఏప్రిల్ 27 : మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు మద్యం రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు భీమారంలో టాటా ఏసీ వాహనాన్ని తనిఖీ చేయగా మద్యం పట్టుబడిందన్నారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని, మద్యాన్ని, వాహనాన్ని, రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశామని, నిందితులు కోటపల్లి మండలానికి చెందిన మహ్మద్ షరీఫ్, తిప్పా రమణయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

ఏసీసీ, ఏప్రిల్ 27: మంచిర్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కత్తాకు చెందిన దేవనాథ్ రాయ్ పట్టణంలోని చింతపండువాడలో ఉంటూ రైళ్లలో సమోసాలు విక్రయిస్తున్నాడన్నారు. మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి మంచిర్యాలకు తెచ్చి అతను సేవిస్తూ, యాచకులు, యువకులకు అమ్ముతున్నాడన్నారు. బల్లార్ష నుంచి పావుకిలో గంజాయి తీసుకువచ్చి రైల్వేస్టేషన్ సమీపంలోని పోచమ్మ గుడి వద్ద ఉండగా పట్టుకున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నగదు పట్టివేత

తాండూర్, ఏప్రిల్ 27 : ఐబీలో శనివారం వాహనాల తనిఖీలు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ జగదీష్‌గౌడ్ తెలిపారు. మహారాష్ట్రలోని దేవాడ ప్రాంతానికి చెందిన లక్క మహేష్, శంకర్‌ల నుంచి రూ.2,96,500లను పట్టుకున్నట్లు తెలిపారు. నగదును సీజ్ చేసి ఎఫ్‌ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల తనిఖీలు

కాసిపేట, ఏప్రిల్ 27: కొండాపూర్ యాప, దేవాపూర్ ప్రాంతాల్లో ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకొంటామన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి



కంట్రోల్‌రూంను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్ గుప్తా

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 27: సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్ గుప్తా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళతో కలిసి సూక్ష్మ పరిశీకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ చేశామన్నారు. చెన్నూరు నియోజకవర్గానికి 30 మంది, బెల్లంపల్లి 33, మంచిర్యాల నియోజకవర్గానికి 32 మంది సూక్ష్మ పరిశీలకులను కేటాయించామన్నారు. లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలల్లో నిబంధనల ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని రావేష్ గుప్తా అన్నారు. డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములుతో కలిసి కంట్రోల్ రూమ్, వెబ్‌కాస్టింగ్, మీడియా సెంటర్‌లను తనిఖీ చేశారు. ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు పలు ప్రాంతాల్లో సెల్ఫీ బోర్డులను ఏర్పాటు చేశామని, ఇందులో సెల్ఫీలు దిగి వాట్సాప్ సోషల్ మీడియాలో పెట్టి ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ సహాయ కార్మిక శాఖ కమిషనర్ వినీత తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షించాలి

హాజీపూర్: ముల్కల్ల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులు పర్యవేక్షించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు రావేష్ గుప్తా పేర్కొన్నారు కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రి యకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, కౌంటింగ్ రోజున బందోబస్తు నిర్వహించాలన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

స్ట్రాంగ్‌రూంలను పరిశీలన

చెన్నూరు: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రవీష్‌గుప్తా పరిశీలించారు. విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళ, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మల్లికార్జున్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ ఉన్నారు.



ముల్కల్లలోని కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు

సకాలంలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

జైపూర్: ఓటర్లకు సకాలంలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని ఎన్నికల పరిశీలకులు రవీష్‌గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 95, 96 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లోని మూత్రశాలలు, నీటి వసతి తదితర వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు కల్పించడంలో అశ్రద్ధ వహించకూడదని సూచించారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజారెడ్డి, సెక్టార్ అధికారి వినీష ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కోటపల్లి: నక్కలపల్లి పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు రవీష్ గుప్తా పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలపై ఆరా తీశారు. మారుమూల ప్రాంతాల్లో గతంలో జరిగిన ఎన్నికల్లో వచ్చిన ఓటింగ్ శాతంపై అరా తీశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలని అధికారులను ఆదేశించారు. సీఐ సుధాకర్, ఎంపీడీవో ఆకుల భూమన్న, తహసీల్దార్ మహేంద్రనాథ్, ఎస్‌ఐ రాజేందర్, ఆర్‌ఐ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనూ ప్రభుత్వాన్ని మార్చండి

● ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ





నస్పూర్ సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంచిర్యాల సభలో నాయకుల అభివాదం

ఏసీసీ/నస్పూర్/శ్రీరాంపూర్, ఏప్రిల్ 27: తెలంగాణలో మార్చినట్లే దేశంలోనూ ప్రభుత్వాన్ని మార్చాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రం, నస్పూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కాంగ్రెస్ ప్రజా ఆశీర్వాద సభ, ఎన్నికల ప్రచార సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ విదేశాల నుంచి నల్ల ధనం తెప్పించి ప్రతీ ఒక్కరి అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తానని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు, న్యాయం చేసేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్, మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకు యాత్ర చేశారన్నారు. దీంతో ప్రధాని మోదీ రాహుల్‌కు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతా యని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పారిశ్రామికవేత్తగా విజయం సాధించిన గడ్డం వంశీ ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపిస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ ఎన్నికలు ఒక తంతు మాత్రమేనని, ప్రజాదరణ చూస్తుంటే వంశీ గెలవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. సింగరేణి కార్మికులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసగించిందని, టీబీజీకేఎస్ కార్మికులను దోపిడీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 900 ఉద్యోగాలు ఇచ్చామని, 750 మంది డిపెండెంట్లకు ఉపయోగ పడేలా వయోపరిమితి 40 ఏళ్లకు పెంచినట్లు తెలిపారు. అతి తక్కువ పెన్షన్ పొందుతున్న రిటైర్డ్ సింగరేణి కార్మికులకు తెల్లరేషన్‌కార్డు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మంచిర్యాల నియోజకవర్గంలో లక్ష మెజారిటీ ఇవ్వాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. ప్రేంసాగర్ రావుకు 66 వేల మెజారిటీ ఇచ్చి ఎమ్మెల్యేను చేశారని, వంశీని సైతం అలాగే గెలిపించాలని కోరారు. ప్రజలందరి ఆశీర్వాదాలతో తాను పెద్దపల్లి ఎంపీగా విజయం సాధించడం ఖాయమని ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. నిధులు, నీళ్లు, నియామకాలు పేరు చెప్పి గద్దెనెక్కిన కేసీఆర్ తెలంగాణను కన్నీటి, నిరుద్యోగ రాష్ట్రంగా మార్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఐదు హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన దాదాపు 300 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి శ్రీధర్ బాబు, ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, శ్రీనివాస్, హర్కర వేణుగోపాల్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు శివసేనా రెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, చెన్నూరు, రామగుండం ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌శాతం పెరిగేందుకు కృషి చేయాలి

● పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్



సెల్ఫీలో రాజేంద్రవిజయ్, కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మే13న నిర్వహించే పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు కృషిచేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వీప్ ఆక్టివిటీస్‌లో ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి సెల్ఫీబోర్డు వద్ద ఫొటోదిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మే13న జరగనున్న పోలింగ్ కార్యక్రమంలో అర్హతగల ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా విస్తృతస్థాయి ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్ శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకబృందాలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని పోలింగ్‌కేంద్రాలకు బ్యాలెట్‌యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు కేటాయించామని తెలిపారు. అత్యవసర సేవలు అందిస్తున్న వారు ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా అవకాశం కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో ప్రసాద్, ఏఈ బద్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతగల విద్యుత్ అందించేందుకు కృషి చేస్తాం

● ట్రాన్స్‌కో సీఎండీ కార్నాటి వరుణ్‌రెడ్డి



సబ్ స్టేషన్ తనిఖీ చేస్తున్న వరుణ్‌రెడ్డి

కౌటాల, ఏప్రిల్ 27: రాష్ట్రంలోని వినియోగదారులకు నాణ్యతగల కరెంటు అందించేందుకు కృషిచేస్తున్నామని ట్రాన్స్‌కో సీఎండీ(నార్తర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్) కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం కౌటాల మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడే విద్యుత్ సరఫరా యార్డ్‌లో ఉన్న జంపర్‌ల స్థితిని చూశారు. ఫీడర్ల వారీగా డిమాండ్, అంతరాయం తదితర సమస్యలు తెలుసుకు న్నారు. ట్రాన్స్‌ఫార్మర్ షెడ్‌ను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్‌లో ఖచ్చింగా నాణ్యతగల మెటీరియల్ వాడాలన్నారు. రైతులకు, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేసే బాధ్యత ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గట్లు సప్లై చేస్తున్నామని చెప్పారు. మారు మూల ప్రాంతాల్లో వ్యవసాయ సరఫరాకోసం ప్రత్యేకశ్రద్ధ పెట్టామన్నారు. వ్యవసాయం కోసం రైతులు పెట్టుకున్న వ్యవసాయ కనెక్షన్లన్నీ వచ్చే జూన్ నాటికి వందశాతం అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. గాలివాన ఎఫెక్ట్ వల్ల విద్యుత్ స్తంభాలు విరగడంతో కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతోందని, విరిగినస్తంభాలు, తెగినతీగలు, కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చుతున్నట్లు తెలిపారు. ఆయనవెంట టీఎస్‌ఎన్పీడీసీఎల్ ఎస్సీ వాసు దేవ్, డీఈ నాగరాజు, ఏడీఈ రాజేశ్వర్, ఏఈలు రవీందర్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌లో వరుస దొంగతనాలు

● బార్‌లో రూ.3లక్షలు
● భట్టుపల్లిలో మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 26: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో శుక్రవారంరాత్రి వరుస దొంగతనాలు జరిగాయి. పట్టణంలోని మున్నీ బార్‌అండ్‌రెస్టారెంట్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మున్నీ బార్‌అండ్‌రెస్టారెంటులోని కౌంటర్ గదిపై భాగంలో ఉన్న రేకులను తొలగించి లోనికి ప్రవేశించి కౌంటర్‌లోని రూ.3లక్షలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంను రంగంలోకి దించి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మున్నీ బార్‌అండ్‌రెస్టారెంటు యాజమాని వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. అలాగేపట్టణంలోని మరో రెండు చోట్ల కూడా చోరీకి యత్నించారు. మండలంలోని భట్టుపల్లిలో నివాసం ఉంటున్న తోట శోభ ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీజరిగినట్లు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఆమె తెలిపినవివరాల ప్రకారం తోటశోభ కుటుంబసభ్యులంతా ఇంటిపైన పడుకోగా, ఇంట్లోకి చొరబడి మూడున్నర తులాల బంగారం, రూ.50వేలు నగదు ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. ఈ మేరకు శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ కరుణాకర్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీ సంఘటనలపై డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం వివరాలు సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

జిల్లాలో 44.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు



ఆసిఫాబాద్‌లో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27: జిల్లాలో శనివారం 44.7డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్ర తలు నమోదయ్యాయి. రెబ్బెన మండలంలో 44.7డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా తిర్యాణిలో 44.6 డిగ్రీలు, పెంచికలపేట, దహెగాంలలో 44.5 డిగ్రీలు, కాగజ్‌నగర్, కెరమెరిలలో 44.1డిగ్రీలు, ఆసిఫాబాద్‌లో 43.9డిగ్రీలు, కౌటాలలో 43.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టింది బీఆర్‌ఎస్: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఆసిఫాబాద్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 27: ప్రజల ఆకాంక్ష నుంచి పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద, బీఆర్‌ఎస్ భవన్ వద్ద, తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే దండే విఠల్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, ఆశలను ఆధారం చేసుకుని 2001 ఏప్రిల్ 27న అతి తక్కువ మందితో పార్టీ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు ద్రుపతాబాయి, అజయ్‌కుమార్, ఎంపీపీ సౌందర్య, పీఏసీ ఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, మైనార్టీ నాయకులు మోహన్, రవీందర్,గణేష్, నిసార్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

కాగజ్‌నగర్: బీఎస్పీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి శనివారం పలువురు చేరారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎమ్మెల్సీదండే విఠల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బందుపటేల్, దుర్గం వెంకటేష్, నక్క శంకర్, శంకరయ్య, శ్యాంరావు, ఉమ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలి: ఎంపీడీవో



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణమూర్తి

కెరమెరి, ఏప్రిల్ 27: నర్సరీలలో పెంచుతున్న మొక్కలను వచ్చే జూన్‌లో నాటేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన సావర్ ఖేడసాంగ్వి, ఖైరి, గోండ్‌గూడ గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో నర్సరీలలోని మొక్కలనురోడ్లకు ఇరువైపులా నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయా గ్రామాల్లో కూలీలసంఖ్య తక్కువగా ఉన్నందున గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, కార్యదర్శి సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు టెక్నాలజీపై దృష్టిసారించాలి: డీఈవో

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 27: విద్యార్థులు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీపై దృష్టి కేంద్రీకరించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు అధ్యక్షతన మూడు రోజులపాటు విద్యార్థులకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ద్వారా నిర్వహించనున్న రోబోటిక్ ప్రోగ్రామింగ్, ఎలక్ట్రానిక్ కోడింగ్ శిక్షణశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరుగుతున్న సాంకేతికవిధానంలో నూతనత్వం ఎంతోఅవసరం అన్నారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచి కంటప్యూటర్‌పై అవగాహనకలిగేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అటల్ టింకరింగ్‌ల్యాబ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంఅందిస్తున్న శిక్షణనువిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదిపాఠశాలల నుంచి 50మందివిద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమితిఅధ్యక్షుడు సతీష్, కార్యదర్శి వేణుగోపాల్, దేవభూషణం, ఉదయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

జైనూర్, ఏప్రిల్ 27: జైనూర్ మార్కెట్‌యార్డులో ఆదివారం అంబేద్కర్ జయంతికి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాంబ్లే బాబాసాహేబ్ శనివారం తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయనాయకులు కేవలం పూలమాలలువేసి నివాళులు అర్పిస్తారన్నారు. మార్కెట్‌యార్డులో భజన, భోజన కార్యక్రమాలు, మేధావులఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అసోషియషన్ మండలాధ్యక్షుడు కాంబ్లే అన్నారావ్, యూత్ అధ్యక్షుడు సోనకాంబ్లే సిద్దు, సోనకాంబ్లే జనార్దన్, గాయక్‌వాడ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు దిక్కెవరు?



- చుక్కలనంటుతున్న కౌలు ధరలు
- ఏటేటా పెరుగుతున్న పెట్టుబడులు
- 50రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం

మరో 50రోజుల్లో వానాకాలం సాగు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మరోసారి భూములను కౌలుకు తీసుకునేందుకు సిద్ధమవుతు న్నారు. అయితే కౌలు వ్యవసాయం వారిని కన్నీరు పెట్టిస్తోంది. భూ యజమానులు కౌలు ధరలను అమాంతం పెంచడం, విత్తన, ఎరువుల ధరలు, కూలీల రేట్లు పెరిగిపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు.

పత్తి, వరి పంట సాగే అధికం...

జిల్లాలో రైతులు అధికంగా పత్తి, వరి పంటలనే సాగు చేస్తారు. జిల్లాలో పెద్దగా సాగు నీటిప్రాజెక్టులు లేని కారణంగా వర్షాధారంపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలో గత ఏడాది 3.50లక్షల ఎకరాల్లో పత్తి, 55వేల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. జిల్లాలో సుమారుగా 20వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా అధికంగా పత్తి సాగు చేస్తారు. జిల్లాలో నాలుగైదు ఏళ్లుగా ప్రకృతి వైపరిత్యాల కారణంగా దిగుబడి రాక నష్టాలను చవిచూస్తున్నారు. ఒక ఏడాది అతివృష్టితో నష్టపోతే, మరో ఏడాది అనావృష్టితో నష్ట పోతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. తొలకరి వానలతో పంటలు విత్తుకున్నా పూత, కాతకు వచ్చే సమయంలో వర్షాలు మొహం చాటేస్తుండటంతో పెట్టుబడి సైతం రాక అప్పుల పాలవుతున్నారు. జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గంలోని బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల పరిధిలో ప్రాణహిత, పెన్‌గంగ ప్రవహిస్తుండటంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో వరదల కారణంగా పంటలన్నీ నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ప్రాణహిత వరదల కారణంగా ప్రతిఏటా దాదాపు 3వేల ఎకరాలకు పైగా పత్తి, 500 ఎకరాల్లో వరి పంటలు నీటమునిగి నష్టపోతు న్నారు. అయినా వీరికి ప్రభుత్వం ఎలాంటి వరదసాయం చేయకపోవటంతో తీవ్రంగా నష్టపోయారు.

వర్తించని ప్రభుత్వ పథకాలు..

కౌలు రైతులకు ఎక్కడా అధికారిక గుర్తింపు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతి పథకానికి వీరు అనర్హులుగా మిగిలిపోతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు వారు పొందలేకపోయారు. 2018లో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రారంభించి ఎకరాకు రూ.5వేల చొప్పున సంవత్సరానికి రూ.10వేల పెట్టుబడి సాయం అందించింది. ఇక రైతు ఏ కారణంతోనైనా చనిపోయినా రైతులకు బీమా కింద రూ.5లక్షలు అందజేసింది. ఇక కేంద్ర ప్రభుత్వం కూడా కిసాన్ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా రూ.6వేలు అందజేస్తోంది. కనీసం బ్యాంకు నుంచి రుణాలు పొందుదామన్నా కూడా పొందలేని పరిస్థితిలో కౌలు రైతులు ఉన్నారు.

దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర ఎక్కువ వడ్డీకి రుణాలు తెచ్చుకొని వ్యవ సాయం చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కౌలు రైతులకు రైతు బంధు పథకం అమలు చేసి వారిని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో కౌలు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే గతంలో ఉమ్మడి రాష్ట్రం లో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కౌలు రైతులు కూడా తమకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట రాకున్నా కౌలు ఇవ్వాల్సిందే..

నైతం అంజయ్య, రైతు ఇప్పలగూడ



భూములను కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా కౌలు వ్యవసాయం చేస్తున్నా. కౌలు భూమిలో పంటలు సాగు చేసి పంట దిగుబడి వచ్చినా రాకున్నా కౌలు చెల్లించాల్సిందే. లేదంటే గ్రామాల్లో కౌలు భూములు ఎక్కడా కూడా దొరకవు. కౌలుతో పాటు సాగు పెట్టుబడి ధరలు కూడా అమాంతం పెరిగి పోవడంతో వ్యవసాయం చేయడం కష్టతరంగా మారింది. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకొని అన్ని రకాల పథకాలు వర్తింపజేయాలి.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలి..

సెండె శంకర్, రైతు చిన్నసిద్దాపూర్



భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలి. రైతులకు అందజేస్తున్న పథకాల మాది రిగానే కౌలు రైతులకు కూడా అన్నిరకాల పథకాలు అమలు చేస్తూ బ్యాం కుల్లో రుణాలు ఇవ్వాలి. కౌలు చేస్తున్న రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతు బంధు ఇవ్వాలి.

జిల్లాలో కౌలు ఎకరానికి 10నుంచి 15 వేల వరకు పలుకుతోంది. భూమిని బట్టి రైతులు కౌలు చెల్లిస్తున్నారు. జిల్లాలో పెద్దగా సాగునీటి ప్రాజెక్టులేమీ లేని కారణంగా వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వర్షాధారంగా పంటలు పండించే భూములకు ఎకరాకు 10నుంచి 15వేల వరకు చెల్లిస్తున్నారు. పంటల దిగుబడితో సంబంధం లేకుండా కౌలును చెల్లించాల్సిన పరిస్థితి ఉండటం, పంటలకు మద్దతు ధర లేకపోవడం వంటి ఇబ్బందులతో కౌలు రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పెట్టిన పెట్టుబడులు సైతం రాక అప్పుల పాలవుతున్నారు. మరో 50 రోజుల్లో వానాకాలం పనులు ప్రారంభమవుతున్న

ముందస్తు చెల్లింపులు..

నేపథ్యంలో సాగు ఖర్చు కోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకొని సాగుచేస్తున్నా కనీసం పెట్టుబడులు సైతం రాని పరిస్థితులు నెలకొన్నాయి. పంట దిగుబడి రాకున్నా వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకున్న డబ్బులను మాత్రం ఎలాగైనా చెల్లించాల్సిందే. ఇక కౌలుకు భూములు తీసుకునే రైతులు ముందస్తుగానే ఏప్రిల్, మే మాసాల్లోనే భూములను కౌలుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్ప టికే కౌలు ధరలు పెరగడం, ఆశించినస్థాయిలో పంటలు దిగుబడి రాని కారణంగా కొందరు రైతులు కౌలుకు భూములు తీసుకోవాలంటేనే భయ పడుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 27: చింతలమానేపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన బండి సదు అలియాస్ సదయ్య(32)చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన సదయ్య ఈనెల 26న మద్యంమత్తులో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన అతని సోదరుడు హన్మంతు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాడు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న క్రమంలో శనివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

దహెగాం, ఏప్రిల్ 27: మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జర్పుల ప్రదీప్, జర్పుల అభి మరోముగ్గురు కలిసి డీజేసౌండ్‌తో అల్లర్లు సృష్టిస్తున్నారు. దీనిపై బదావత్ తిరుపతి వారిని ప్రశ్నించాడు. దీనితో ఆ ఐదుగురు కలిసి తిరుపతిపై దాడిచేసి గాయపర్చారు. ఈ మేరకు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 27: పట్టణంలోని రాయల్ గార్డెన్ సమీపంలో సంజీవయ్య కాలనీకి చెందిన బొమ్మెన వినోద్(30) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాయల్ గార్డెన్ సమీపంలో మృతదేహం ఉన్నట్లు కాలనీవాసులు సమాచారం అందించగా ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా సంజీవయ్య కాలనీకి చెందిన బొమ్మెన వినోద్‌గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు హమాలీగా పనిచేసే వాడన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సభా స్థలి పరిశీలన

కెరమెరి, ఏప్రిల్ 27: మండలకేంద్రంలో ఆదివారం మంత్రి సీతక్క, పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి నిర్వహించే కాంగ్రెస్ పార్టీ బహిరంగసభ స్థలిని శనివారం డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, నాయకులు మునీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట నాయకులు ఎల్లప్ప, సుదర్శణ్, జలపత్‌రావు, లింబారావు, తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం బీజేపీ ఏం చేసింది?

- బీజేపీ వాళ్లు దేశ భక్తులు మేం దేశ ద్రోహులమా?
- దేశం కోసం పాటుపడ్డది ఇందిరమ్మ కుటుంబమే
- రూ.7లక్షల కోట్లు అప్పు చేసిన కేసీఆర్
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క


బెజ్జూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

బెజ్జూరు, ఏప్రిల్ 27: దేశానికి చేసింది, చేసేది చెప్పలేక రాజకీయాలకోసం బీజేపీ దేవున్ని వాడుకుంటున్నదని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం బెజ్జూరు మండల కేంద్రంలో పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవుడి పేరుతో రాజకీయం చేసి దేవున్ని రోడ్ల మీదకు తెచ్చిన బీజేపీ వాళ్ల దేశభక్తులు, దేశం కోసం పాటుపడిన ఇందిరమ్మ కుటుంబం మాత్రం దేశ ద్రోహులయ్యారా అని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే 2కోట్ల ఉద్యోగాలు కల్పించడంతోపాటు నల్లధనం బయటకు తీసి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని మోసం చేసిందన్నారు. ట్యాక్స్ టెర్రరిజం పేరుతో బీజేపీ పెద్ద కుట్ర చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే దేశంలో రేషన్,విద్య, ప్రాజెక్టులు, రేషన్‌కార్డులు, ఇతర పథకాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వలసలు నివారించి పేదల కోసం ఉపాధిహామీ పథకాన్ని తెచ్చి 100రోజుల పనికల్పించామని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ 40రోజులకు తగ్గించి కూలీలను మోసం చేసిందన్నారు. ఆదివాసీ మహిళ ఆత్రం సుగుణను ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆదివాసీమహిళ ఎంపీగా ఉంటే పార్లమెంటులో తనగొంతు వినిపించి ఈప్రాంతాన్ని అభివృద్ధి చేస్తుందని అన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ ఆదివాసీ పేదిం టి మహిళగా తనను ఒక్కసారి ఆశీర్వ దించాలని, ఈ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. అనంతరం సిర్పూర్ ఇన్‌చార్జీ రావిశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి పట్టంకట్టాలని కోరారు. ఆదివాసీ మహిళను గెలిపిస్తే అందుబాటు లో ఉండి సేవ చేస్తుందన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి మంత్రి సీతక్క సమక్షంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీజడ్పీచైర్మన్ సిడాం గణపతి, ఎంపీపీలు డోకె రోజారమణి, దుబ్బుల నానయ్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు శంకర్, పీఏసీఎస్ చైర్మెన్ ఓంప్రకాష్, నాయకులు జగ్గాగౌడ్, వెంకన్న, సతీష్, నాహీర్ అలీ, నరేందర్ గౌడ్, మహేష్, జాహీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సత్రాన్ని సందర్శించిన మంత్రి సీతక్క

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌లో మాజీఎమ్మెల్యే కోనప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన సత్రాన్ని శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా అన్నదానం చేస్తున్న తీరుతెన్నులపై కోనేరు కోనప్పను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొని పలువురికి అన్నం వడ్డించారు. ఆమెవెంట కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.


బెజ్జూరలో బహిరంగ సభకు హాజరైన జనం

ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలి

పెంచికలపేట: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఆరుగ్యారంటీల పథకం అమలు చేస్తున్నామన్నారు. చేతి గుర్తుకు ఓటేసి సుగుణక్కను గెలిపించాలని అన్నారు. అటవీ గ్రామాల రోడ్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. బీజేపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వాటిని విశ్వసించరని ఆమె పేర్కొన్నారు. రాజ్యాంగం ఉండకూడదని కుట్రలో భాగంగా రిజర్వేషన్లు తీసేస్తామని అంటున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అదిలాబాద్ జిల్లాలో ఏ పార్టీ కూడా గిరిజన ఆడబిడ్డకు ఎంపీగా అవకాశం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యావంతురాలైన ఆత్రం సుగుణకు అవకాశం ఇచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీకేంద్ర మంత్రి వేణుగోపాలచారి, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జిల్లా ఇంచార్జీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, కోఆప్షన్‌సభ్యుడు సిద్దిక్, జడ్పీటీసీ సముద్రాల సరిత, పెంచికలపేట, దహెగాం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పూర్తిగా నివారించడానికి శనివారం సాయంత్రం 4నుంచి 6గంటలవరకు ఎస్పీ ప్రత్యేకడ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో పాతనేరస్తులు, గంజాయి కేసులలో దొరికిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలోగంజాయిని పూర్తిగా నివారించడానికి స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి అనుమానంవచ్చిన ప్రదేశాల్లోసోదాలు నిర్వహిస్తామన్నారు. దీని కోసం ప్రత్యేకటీం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడు కేసుల్లో 11మందినిఅరెస్టు చేశామన్నారు. ఆరుకేసులలో3112కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అక్రమమార్గంలో ఎటువంటిమద్యం, డబ్బులు, ప్రజలను ప్రలోభపెట్టే వస్తువులను జిల్లాకు రాకుండా వివిధశాఖల సమన్వయంతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. యువత నిషేధిత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలైతేవారి వివరాలను 8712670523కి ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు. వారికి డీఅడిక్షన్ సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మత్తు పదార్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనవెంట డీఎస్పీ సదయ్య, సీఐ రాణాప్రతాప్, సతీష్‌ఎస్సై ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సదరమ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27: జిల్లాలో ఈనెల29న జరగనున్న సదరమ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సర్టిఫికేట్ కాలపరిమితి ముగిసి పునరుద్ధరణ కొరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దివ్యాంగత్వ పరీక్ష చేయించుకుని స్లాట్‌బుక్ చేసుకోవాలని తరువాత క్యాంపునకు హాజరు కావాలన్నారు. ఈనెల29న మూగ, చెవిటి, కంటిచూపు, 30న మానసికవైకల్యం, ఎముకలు, మే7న కంటిచూపు, 18న మానసిక వైకల్యం, 21న మూగ, చెవిటి, 28నఎముకలు సంబంధిత అభ్యర్థులు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు పట్నాపూర్‌లో పర్యటించనున్న మంత్రి సీతక్క

లింగాపూర్, ఏప్రిల్ 27: మంత్రి సీతక్క ఆదివారం జైనూరు మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర్ సంస్థాన్‌లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ తెలిపారు. ఈసందర్భంగా పట్నాపూర్‌లోని పరమహంస సద్గురు పుల్లాజీబాబా సమాధి మందిరంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేస్తారని ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీ

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 27: గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారానికి గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వకార్యదర్శి శరత్ హామీఇచ్చినట్లు ఉపాధ్యాయసంఘం రాష్ట్రశాఖనాయకులు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగియగానే జూన్ రెండోవారంలో గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియప్రారంభించనున్నట్లు హామీఇచ్చినట్లు తెలిపారు. అలాగే డైట్‌చార్జీల విడుదల, సీఆర్టీల సమస్యల పరిష్కారం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవీరావు,రాములునాయక్,బయ్యన్న, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠినచర్యలు


వాంకిడిలో దుకాణాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వాంకిడి, ఏప్రిల్ 27: నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ సదయ్య అన్నారు. శనివారం బస్టాండు సమీపంలోని పాన్, టీషాపులలో సీఐ శ్రీనివాస్, ఎస్సైసాగర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పొగాకు ఉత్పత్తులైన సిగరేట్, గుట్కా, చాకెట్లను పరిశీలించారు. గంజాయి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారంతో సోదాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. బస్టాండు పరిసరప్రాంతాల్లోని పాన్‌షాపులలో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అంబలి పంపిణీ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 27: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో శనివారం వివిధప్రాంతాల నుంచి వచ్చేవారి దాహార్తిని తీర్చేందుకు అంబలి పంపిణీ చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉబెడబీన్ యాహి యా తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ డైరెక్టర్ రమణా రెడ్డి, వినాయక్ రావు, శంకర్, పిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు

కాసిపేట, ఏప్రిల్ 27: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తమ్మల రాజిరెడ్డి అన్నారు. శనివారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొంత కాలంగా కాసిపేట 2వగనిలో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, ఇది సరైంది కాదన్నారు. అధికారులు కార్మికులను వేధించడం మానుకోవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తుందన్నారు. అనంతర కాసిపేట 2గని నూతన పిట్ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం ఇతర యూనియన్‌ల నాయకులు సీఐటీయూలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, అల్లి రాజేందర్, సంజీవ్, భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మే డేను ఘనంగా నిర్వహించుకోవాలి: ఏఐటీయూసీ


సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 27: ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన వచ్చేనెల 1న మేడేను ఘనంగా నిర్వహించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అమెరికాలోని చికాగో నగరంలో 8గంటల పనిదినాన్ని అమలు చేయాలని కార్మికులు ఆందోళన చేస్తుండగా, అప్పటి ప్రభుత్వం పోలీసులతో వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపించిందన్నారు. దీంతో వేల మంది కార్మికులు అమరులయ్యారని అన్నారు. వారిని స్మరించుకుంటూ మేడే నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. ప్రస్తుతం దేశంలోని కేంద్రప్రభుత్వం కార్మికుల పని గంటలను 12కు పెంచేందుకు ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆ ప్రయత్నాలను కార్మికవర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆదివారం నస్పూర్‌లోని మనోరంజన్ సముదాయంలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కార్మికులను కోరారు. అనంతరం టీబీజీకేఎస్‌కు చెందిన 30మంది కార్మికులు ఏఐటీ యూసీలో చేరారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అఫ్రోజ్‌ఖాన్, దాడి రాజయ్య, నల్లపు సత్తయ్య, మోహన్ రెడ్డి, సతీష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్లు విడుదల

శ్రీరాంపూర్: సింగరేణికాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూయు-ఐఎఫ్‌టీయు) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సురేష్, రాజష్, రాంబాబు, కవిత, మల్లేశ్వరి, శిరీష, సత్య, తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ఎస్‌ఎస్‌సీడబ్ల్యూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు గోలేటిలో మేడే పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్‌ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ మేడే సందర్భంగా ర్యాలీలుతీసి కార్మికుల ఐక్యతను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారి తిరుపతి, పోశం, శ్రీనివాస్, చంద్రయ్య, భీమేష్, సంతు, స్వామి, చందు, పోసుబాయి, రాణి, సావిత్రి, నాగలక్ష్మి, శారద, మల్లేశ్వరి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.